క్లుప్తంగా

ఎన్నికల నిబంధనలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ గణేష్

మధిరరూరల్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున ఎన్నికల నిబంధనలను కఠినంగా అమలు చేయాలని మధిర నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ గణేష్ తెలిపారు. మధిర మండల పరిషత్ కార్యాలయంలో మధిర నియోజకవర్గం స్థాయిలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు అనుమతి పొందిన తర్వాతనే సభలు, సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు పెట్టే ఖర్చును లెక్కించేందుకు నియోజకవర్గంలో 6 బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మధిర సీఐ జాటోత్ వసంత్ కుమార్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ అంబటి రమాదేవి పాల్గొన్నారు.

క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

బోనకల్/వేంసూరు: ఆంధ్రా–తెలంగాణా సరిహద్దు కావడంతో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆర్డీఓ గణేష్, ఎస్సై వీర ప్రసాద్ తెలిపారు. బుధవారం బోనకల్, వేంసూరు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ సమీపంలో గల చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో పున్నం చందర్, ఎంపీడీఓ అశోక్, ఎస్సై సాయికుమార్ ఉన్నారు.

గురుకులంలో ముందస్తు బతుకమ్మ వేడుకలు



మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో బతుకమ్మలతో అధ్యాపకులు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఉమాదేవి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రావణి, మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మహిళకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: అనారోగ్యంతో బాధ పడుతున్న ఓ మహిళకు వైరా లయన్స్‌క్లబ్ వారు ఆర్థిక సాయం అందజేశారు. వైరాలోని శాంతినగర్ పుతుంబాక కృష్ణ మూర్తి ఇంటివద్ద నిర్వహించిన కార్యక్రమంలో శాంతినగర్‌కు చెందిన ఎస్ బుజ్జి అనే మహిళ అనారోగ్యం కారణంగా ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15,500లను నంబూరి మధు, పీడీజీ డాక్టర్ కాపా మురళీ కృష్ణ, పుతుంబాక ఇంద్రాణి చేతుల మీదుగా అందించారు. క్లబ్ అధ్యక్షుడు పెనుగొండ ఉపేందర్‌రావు, జీఎంటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు, లగడపాటి ప్రభాకర్, వెంకటేశ్వరరావు, చింతోజు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనానికి విద్యార్థి ఎంపిక

ఏన్కూరు: కేంద్ర ప్రభుత్వ ఉపకావేతనానికి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి మీనుగు నాగరాజు ఎంపికయ్యాడు. 2023 విద్యా సంవత్సరంలో ఇంటర్ 939/1000 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచాడు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ప్రతిభ ఉపకారవేతనం రూ.10 వేలు విద్యార్థి పీజీ, డిగ్రీ పూర్తి చేసే వరకు ప్రతి ఏడాది చెల్లిస్తారు. ప్రతిభ ఉపకార వేతనానికి ఎన్నికైన నాగరాజును ప్రిన్సిపాల్ వెంకటేశ్వరావు, సిబ్బంది అభినందించారు.

ప్రభుత్వాన్ని గద్దెదించాలి

బోనకల్: గొర్రెలు ఇస్తానని డీడీలు కట్టించుకొని గొర్రెలు ఇవ్వకుండా మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను, ప్రభుత్వాన్ని నిలదీయాలని పొంగులేటి ప్రధాన అనుచరుడు మేకల మల్లిబాబు యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కురమ యాదవులను మోసం చేసిన కేసీఆర్‌కు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ సమావేశంలో యాదవ సంఘం నాయకులు రాములు, సైదులు, నరసింహారావు, ముత్తయ్య, రవి, గోపి, శ్రీను, రేఖ, మురళి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో వరిజోరు



తల్లాడలో సాగర్ కాల్వల కింద సాగు చేసిన వరి పైరు

- మొగ్గు చూపిన ఎక్కువ మంది రైతులు
- మండలంలో 22 వేల ఎకరాల్లో వరిసాగు
- వెదజల్లే పద్ధతి వైపు రైతుల ఆసక్తి
- ఎన్ఎస్‌పీ, చెరువులు, చెక్ డ్యామ్‌ల కింద సాగు
- సన్నరకాలే అధికం

తల్లాడ: ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయ సీజన్లో అధిక విస్తీర్ణంలో రైతులు వరి పైరును సాగు చేశారు. నాగార్జున సాగర్ ఆయకట్టు కింద ఉన్న వరి పంటే ఇక్కడ ప్రధానంగా పండిస్తారు. సాగర్ కాల్వలతో పాటు చెరువులు, కుంటలు, చెక్ డ్యామ్‌ల కింద ఈ ఏడాది వెదజల్లే పద్ధతి, నాటు పద్ధతిలో వరి పంట వేశారు.

నాగార్జున సాగర్ కాల్వలకింద 15 వేల ఎకరాల్లో..

మండలంలో నాగార్జున సాగర్ కాల్వల కింద ఖరీఫ్ వ్యవసాయ సీజన్లో 15 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. జులై నెలాఖరు నుంచి ఆగస్టు 31 వరకు వరి పంట వేశారు. ప్రస్తుతం వరి పైరు పొట్ట దశలో ఉన్నది. మిగిలిన 8 వేల ఎకరాలు చెరువులు, కుంటలు, చెక్ డ్యామ్‌లు, లిఫ్టులు, వాగుల కింద సాగు చేశారు. సాగర్ కింద సాగు వరి పైరు సాగు చేసిన రైతులు నీటి కోసం ఎదురు చూస్తున్నారు. సాగర్ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసి వరి పంటకు నీరివ్వాలని ప్రభుత్వం ప్రకటించడంతో రైతుల ఆశలు చిగురించాయి. ప్రతి ఏటా జులై నెలాఖరు, ఆగస్టు నెల మొదటి వారంలో సాగర్ నీటిని విడుదల చేస్తారు. ఈ సంవత్సరం అక్టోబర్ మొదటి వారం దాటినా సాగర్ నీరు రాలేదు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వరి రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మరో మూడు రోజుల్లో సాగర్ నీరు రానుంది.

వెదజల్లే పద్ధతిలోనే ఎక్కువ సాగు..

ఈ ఏడాది ఖరీఫ్‌లో సైతం వెదజల్లే పద్ధతి ద్వారానే ఎక్కువగా వరి సాగు చేయడం విశేషం. ఇంతకు ముందు గతేడాది నాలుగు వేల ఎకరాలు మాత్రమే సాగు చేసిన వెదజల్లే పద్ధతి వరి ఈ ఖరీఫ్‌లో 13 వేల ఎకరాల్లో సాగు చేశారు. కూలీలతో పని లేకుండా సాగు చేసుకొనే అవకాశం ఉండటంతో ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. కూలీల చేత వరి నాటు వేసే పద్ధతిలో 9 వేల ఎకరాల్లో వేశారు. వెదజల్లే పద్ధతిలో ఎకరానికి ఒక మనిషి వడ్లను రెండు గంటల్లోనే చల్లవచ్చు. సమయం ఆదా కావడంతో పాటు కూలీల ఖర్చు కూడా తగ్గుతుంది. నాటు వేసే పద్ధతి కంటే వెదజల్లే పద్ధతిలో రూ.4 వేలు ఖర్చు తగ్గుతుంది.



ఎన్ఎస్‌పీ సిరిపురం మేజరు కాల్వ

అంతా సాంబ మసూరానే..

ఈ ఖరీఫ్ సీజన్లో మండల వ్యాప్తంగా సాంబ మసూర వరినే సాగు చేశారు. బీపీటీ 1262, 1061, ఇన్‌ఫ్రూట్ సాంబ మసూర వరిని సాగు చేశారు. 135 నుంచి 140 రోజుల్లో ఈ పంట చేతికొస్తోంది. ఈ ఏడాదిలో సాగు చేసిన సాంబ మసూర వరిలో తెగుళ్ల కూడా తక్కువే. అక్కడక్కడా ఆకు ముడత తెగులు సోకింది. అది కూడా అదుపులోకి వచ్చింది. దీంతో ఈ ఏడాది దిగుబడి కూడా ఆశాజనకంగా ఉంటుందనీ రైతులు అభిప్రాయ పడుతున్నారు. ప్రస్తుతం వరి ఏపుగా పెరిగి పొట్ట దశలో ఉంది. మరో రెండు నెలల్లో వరి కోతకొస్తోంది.

రెండు ఎకరాల్లో సాగు చేశా..



నాగార్జున సాగర్‌కాల్వ కింద, చెరువు కింద కలిపి రెండెకరాల్లో వరి పంట వేశాను. ప్రస్తుతం వరి ఆశాజనకంగానే ఉంది. వరి పొట్ట దశలో ఉంది. ప్రస్తుతం నీటి అవసరం బాగా ఉంటుంది. ఈ తరుణంలో సాగర్ నీరు విడుదల చేస్తున్నట్లు ప్రకటించడంతో సంతోషంగా ఉంది. సాగర్ నీరు రాగానే పైరంతా తడిచేలా నీరు పెట్టుకుంటాం.

– దుగ్గిదేవర చందర్‌రావు, రైతు, మల్లవరం

సాంబమసూర వరి..



10 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి పైరు సాగు చేశాను. సాంబమసూర వరి సాగు చేయగా ఆశాజనకంగానే ఉంది. సాగర్ నీరు వస్తే ఇక పంట గట్టెక్కినట్లే. ఇప్పటి వరకు అడపా దడపా కురుస్తున్న వర్షాలకు, మోటార్ల ద్వారా తడులు పెట్టినా.. ఎండలు బాగా వస్తుండటంతో సాగర్ నీరు అవసరం బాగా ఏర్పడింది.

– దామవరపు నరసింహారావు(బుజ్జి) కౌలు రైతు, తల్లాడ

గ్రేడ్‌-1 సాగు ఎక్కువ..



మండల వ్యాప్తంగా ఖరీఫ్‌లో 22 వేల ఎకరాల్లో వరి పైరు వెదజల్లే పద్ధతి, నాటు వేసే పద్ధతిలో సాగు చేశారు. ఈ సంవత్సరం విస్తీర్ణం పెరగడంతో పాటు పైరు కూడా ఆశా జనకంగా ఉంది. మరో మూడు రోజుల్లో సాగర్ నీరు కూడా వస్తుండటంతో ఇక వరి పంటకు డోకాలేదు. సాంబ గ్రేడ్ 1 రకాన్ని మండలంలో ఎక్కువగా సాగు చేశారు.

– ఎండి.తాజుద్దీన్, ఏఓ, తల్లాడ

ఉపాధిహామీ చట్టం నిర్వీర్యం



ముదిగొండ: వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

మధిర/ముదిగొండ: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తేలప్రోలు రాధాకృష్ణ తెలిపారు. ఈ సంఘం ఆధ్వర్యంలో పలు సమస్యలపై బుధవారం మధిరలోని తహసీల్దార్ వెంకటేశ్వర్, ముదిగొండలోని తహసీల్ సీనియర్ అసిస్టెంట్ సునీతకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేలాది మంది వ్యవసాయ కార్మికులు ఉపాధి పనులను నమ్ముకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వారికి 200రోజులు పని కల్పించడంతో పాటు కనీస వేతనం రోజుకు రూ.600 ఇవ్వాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మద్దాల ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వేల్పుల భద్రయ్య, వ్యకాసా సంఘం నాయకులు జక్కుల నాగేశ్వరరావు, కొండయ్య, రాములు, మందరపు వెంకన్న, సైదులు, ఉపేందర్, అశోక్, సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరిక



పార్టీలో చేరిన వారితో జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, నాయకులు

బోనకల్: మండలంలోని గోవిందాపురం, లక్ష్మీపురం, తూటికుంట్ల గ్రామాలలో వివిధ పార్టీల నుంచి 50 కుటుంబాలు జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముందుగా బోనకల్ మండలానికి దళితబంధు ఇవ్వడంపై.. సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మధిర నియోజక వర్గ ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బందం శ్రీను, మండలాధ్యక్షుడు మల్లిఖార్జున్, నాయకులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను సాధించాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి

సత్తుపల్లిరూరల్: బాల్యం నుంచి క్రమశిక్షణ అలవర్చుకుని, కష్టపడి ఉన్నత లక్ష్యాలను సాధించాలని.. అప్పుడే విజయం దరిచేరుతుందని సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి అన్నారు. బుధవారం సత్తుపల్లి ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో బాలికలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం బాలికల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన పలు చట్టాల పట్ల బాలికలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇంట్లో ఆడపిల్ల చదువుకుంటే కుటుంబంతో పాటు సమాజం బాగుపడుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు స్ఫూర్తిదాయక మైన మహిళల జీవిత చరిత్రలను వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భోజన కార్మికుల సమ్మె వాయిదా

పెనుబల్లి: సీఐటీయూ ఆధ్వర్యంలో గత నెల 28 నుంచి తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు ఎన్నికల కోడ్ వల్ల సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఎంఈఓ సీహెచ్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చలమాల విఠల్‌రావు మాట్లాడుతూ.. రేపటి నుంచి అందరూ విధుల్లోకి చేరాలన్నారు.

ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించండి



సత్తుపల్లి ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి

సత్తుపల్లిటౌన్: సురక్షితమైన ప్రయాణం కోసం ప్రతి ఒక్క రూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని సత్తుపల్లి డీఎం యు.రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. దసరాకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి లక్కీ డ్రా నిర్వహించి ప్రత్యేక బహుమతులు యాజమాన్యం అందించనున్నట్లు ఆమె తెలిపారు. ప్రయాణికులు టికెట్ వెనుక మీ పేరు, ఫోన్‌నంబర్ రాసి ఆయా బస్టాండ్‌లలో ఏర్పాటు చేసిన బాక్సుల్లో వేయాలన్నారు. అనంతరం లక్కీడ్రాల్లో ఖమ్మం రీజియన్ పరిధిలోని ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలను విజేతలుగా ప్రకటించి సంస్థ మేనేజింగ్ సజ్జనార్ చేతుల మీదుగా రూ.9,900లు విలువ చేసే బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 13 నుంచి 24వ తేదీ వరకు దసరా సందర్భంగా 84 బస్సులు సత్తుపల్లి డిపో నుంచి సాధారణ ఛార్జీలతో నడపనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

కల్లూరురూరల్: కాంగ్రెస్ ప్రకటించిన ఆరుగ్యారెంటీ పథకాలపై బుధవారం కల్లూరు మండలంలోని ముగ్గు వెంకటాపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్దబోయిన దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో బూత్ క్లస్టర్ ఇన్‌చార్జ్ కీసర శ్రీనివాస రెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు బైరెడ్డి మనోహర్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ కన్వీనర్ కొండూరి కిరణ్, రాయల నాగేశ్వరరావు, కల్లెపల్లి రమేష్, కుటుంబరావు, ఆనందరావు, శాంతయ్య, వందనం పాల్గొన్నారు.

రత్నం రాజు సేవలు మరువలేనివి

వేంసూరు: మండలంలోని భరణిపాడు పాఠశాల అభివృద్ధి ప్రధానోపాధ్యాయుడిగా రత్నం రాజు చేసిన సేవలు మరువలేనివని పలువురు అన్నారు. భరిణపాడు పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన రత్నంరాజును గ్రామస్తులు, సర్పంచ్, ఎంపీపీతో పాటు మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు బుధవారం పూల మాలలు, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొంది పాఠశాల మంచి పేరు తీసుకొచ్చారని.. పాఠశాల ఆవరణాన్ని పచ్చటి మొక్కలతో సుందరంగా మార్చారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటేశ్వరరావు, సర్పంచ్ సునీత వెంకటరెడ్డి, ఎంఈఓ సీహెచ్ వెంకటేశ్వరరావు, మందపాటి మహేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు చింతాకృష్ణ, రవి, భూపాల్‌రెడ్డి, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పుల్లయ్య కుటుంబానికి భట్టి పరామర్శ

చింతకాని: మండలంలోని నర్సింహాపురం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు పొసంగులపాటి పుల్లయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబాన్ని సీఎల్పీ నేత, మధిర శాసనసభ్యుడు మల్లు భట్టివిక్రమార్క బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పుల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, జిల్లా నాయకులు రాయల నాగేశ్వరరావు, ఖమ్మం నగర అధ్యక్షుడు జావీద్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరభద్రం, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మండల అధికార ప్రతినిధులు కిషోర్, భాస్కర్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గోవిందరావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగార్జున్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్లను నడవనీయం..



మట్టి ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్తులు

సత్తుపల్లిరూరల్: రోడ్లపై విచ్చలవిడిగా ట్రాక్టర్లు మట్టిని తరలిస్తుండటంతో.. దుమ్ము, దూళి లేచి ఇళ్లల్లోకి చేరడంతో శ్వాసకోసవ్యాధులు వస్తున్నాయని గ్రామస్తులు వాపోయారు. ఈ సందర్భంగా బుధవారం రోడ్లపై ప్రయాణించే ట్రాక్టర్లను అడ్డుకున్నారు. సింగరేణి అధికారులు.. పొల్యూషన్ లేకుండా చేస్తామని ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నరుకుళ్ల సత్యనారాయణ, మోరంపూడి కృష్ణ, బొడ్డు రాంబాబు, కొలవనేని నాగేశ్వరరావు, వై.వెంకటేశ్వరరావు, హరిబాబు, సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడ్డా..



ముత్తగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

పెనుబల్లి: ఎటువంటి స్వార్థం లేకుండా సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడ్డానని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. బుధవారం పెనుబల్లి మండలంలోని ముత్తగూడెం, కేఎంబంజర్, ఎల్ఎస్ బంజర్, అగ్రహారం, సూరయ్యబంజర్ తండా గ్రామాల్లో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విస్తృతంగా పర్యటించి అభివృద్ధి చేసిన తనకు మద్దతుగా నిలవాలని ఆయా గ్రామ ప్రజలను కోరారు. ముత్తగూడెం గ్రామ ప్రజలు భారీ ర్యాలీతో స్వాగతం పలకగా, అగ్రహారం తండా వాసులు గిరిజన నృత్యాలతో స్వాగతం పలికారు. కేఎం బంజర్‌లో దళితులతో సమావేశం నిర్వహించారు. ఎల్ఎస్ బంజర్ గ్రామస్తులు తమ గ్రామంలో కట్టలేరుపై బ్రిడ్జి నిర్మాణం చేపించినందుకు కృతజ్ఞతగా సన్మానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, ఎంపీపీ లక్కినేని అలేఖ్య, నాయకులు కనగాల వెంకట్రావు, చింతనిప్పు కృష్ణచైతన్య, చీకటి రామారావు, తిరుమలశెట్టి నాగదాసు, కందిమళ్ల వెంకట సత్యనారాయణ, కర్నాటి భద్రారెడ్డి, కొప్పుల గోవిందరావు, భూక్యా ప్రసాద్, అశోక్‌కుమార్, తాతారావు పాల్గొన్నారు.

15 నుంచి దేవీ శరన్నవరాత్రోత్సవాలు



ఎర్రుపాలెం: జమలాపురంలో పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఈఓ జగన్మోహన్‌రావు

మధిర/ఎర్రుపాలెం/ముదిగొండ: తెలంగాణా తిరుపతి జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో, తల్లాడ కోటమైసమ్మా దేవాలయంలో.. ఈ నెల 15 నుంచి 23 వరకు శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఆలయ కమిటీ అధ్యక్షుడు కపిలవాయి జగన్మోహన్‌రావు, అర్చకుడు కంచల సతీష్ శర్మ తెలిపారు. బుధవారం ఆలయంలోని ఈఓ చాంబర్‌లో, అమ్మవారి ఆలయంలో బుక్‌లెట్స్, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ.. ఉత్సవాలకు సంబంధించి ఏపీ, తెలంగాణా రాష్ట్రాల్లోని పలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. 9 రోజుల పాటు జరిగే ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి శ్రీవారిని, అమ్మవార్లను దర్శించుకోవాలని కోరారు. ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశామన్నారు. ఈ సమావేశంలో సూపరిండెంట్ కె.విజయకుమారి, ఆలయ అర్చకులు శ్రీనివాసుల శేషాచార్యులు, కృష్ణారావు, సూర్య ప్రకాష్ రావు, దాచేపల్లి రాము, ఊటుకూరు రవికుమార్, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై కేంద్ర మంత్రికి వినతి



కేంద్ర మంత్రి బీఎల్‌వర్మకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తల్లాడ: మండలంలోని పలు సమస్యలపై కేంద్ర సహకార శాఖా మంత్రి బీఎల్ వర్మకు తల్లాడ మండల బీజేపీ నాయకులు వినతి పత్రం అందించారు. బుధవారం కల్లూరు వచ్చిన కేంద్రమంత్రికి బీజేపీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. సాగర్ జలాలను వెంటనే విడుదల చేసి ఎండిపోయే పంటలను కాపాడాలని, మిట్టపల్లి నుంచి కుర్నవల్లి వరకు పోయే రహదారిలో దేవరపల్లి గ్రీన్ పీల్డ్ హైవే నిర్మాణం జరుగుతున్నందున గ్రీన్ పీల్డ్ హైవే ఎక్కేందుకు దారి కావాలని విన్నవించుకున్నారు. ఈ విషయంపై మంత్రి సానుకూలంగా స్పందించి ఈ రెండు సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యువమోర్చా అధ్యక్షుడు సుధాకర్, బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ రామలింగేశ్వరరావు, గల్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తా..



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మూర్తి

మధిర: తెలంగాణ ఉద్యమకారుల ఆలోచన మేరకు వచ్చేనెల 3న బీఆర్ఎస్ రెబల్ అభ్యర్థిగా మధిర స్థానానికి నామినేషన్ దాఖలు చేయనున్నట్లు బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్, ఉద్యమకారుడు బొమ్మెర రామ్మూర్తి తెలిపారు. మధిరలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఉద్యమంలో కేసులు పాలై జైలు జీవితాన్ని గడిపిన తాను ఆంధ్ర సరిహద్దున ఉన్న మధిర నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను బలోపేతం చేశానని తెలిపారు. అయినా తనకు ప్రతీ ఎన్నికల్లో అన్యాయం చేస్తుండడమే కాక ఓడిపోయే వ్యక్తికే టికెట్ కేటాయిస్తున్నారని విమర్శించారు. తానేం పాపం చేశానో పార్టీ పెద్దలు ప్రకటించాకే పార్టీ అభ్యర్థికి బీ ఫాం ఇవ్వాలని, మూడుసార్లు ఓడిన వ్యక్తి టికెట్ ఇచ్చే విషయమై పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. కాగా, మల్లు భట్టి విక్రమార్కతో జిల్లాకు చెందిన మంత్రి చీకటి ఒప్పందం కుదుర్చుకున్నారని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో బొబ్బిళ్లపాటి బాబురావు, పగిడిపల్లి వినోద్, సురేష్ పాల్గొన్నారు.

న్యాయమూర్తికి కృతజ్ఞతలు



జిల్లా న్యాయమూర్తికి కృతజ్ఞతలు తెలుపుతున్న న్యాయవాదులు

మధిర: మధిరలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు చేయడానికి కృషి చేసిన జిల్లా జడ్జి బీఎస్ జగ్జీవన్ కుమార్‌కు మధిర బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మంలో ఖమ్మం ప్రిన్సిపాల్ జిల్లా సెషన్స్ జడ్జిని బుధవారం మధిరకు చెందిన పలువురు న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ.. మధిరలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టును సాధ్యమైనంత తొందరలో ఏర్పాటు చేయడానికి, అదేవిధంగా నూతన భవన నిర్మాణానికి తన వంతు సహకారాన్ని అందిస్తానని ఆయన బార్ అసోసియేషన్‌కు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ, ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షులు దిరిశాల కృష్ణారావు, మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షులు బోజడ్ల పుల్లారావు, సీనియర్ న్యాయవాదులు సుంకు మోహన్ దాస్, నంబూరు జనార్దన్ రావు, ఏడునూతల శ్రీనివాసరావు, నెల్లూరు రవి పాల్గొన్నారు.

16 మందిపై బెండోవర్ కేసులు

వేంసూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహిస్తున్న 16మంది వ్యక్తులను బుధవారం తహసీల్దార్ ఎంఏ రాజు బెండోవర్ చేశారు.

ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న డాక్టర్లు వీరబాబు, వెంకట్‌లాల్

ఎర్రుపాలెం: మండలంలోని రామాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం బనిగండ్లపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. కీళ్లనొప్పులు, గ్యాస్ట్రబుల్, జ్వరం, జలుబు, దగ్గు, షుగర్, బీపీ, తదితర వ్యాధులతో బాధపడుతున్న 87 మంది రోగులకు డాక్టర్ వీరబాబు, డాక్టర్ వెంకట్‌లాల్ వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్మూరి గోపాలరావు, హెచ్ఈఓ సదాశివరావు, సూపర్ వైజర్లు పద్మావతి, వెంకటేశ్వరరావు, మానిక, ఏఎన్ఎం సరళ, ఫార్మాసిస్టు శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి కిశోర్ ఉన్నారు.

‘న్యూ లిటిల్ ఫ్లవర్స్’లో హిమోగ్లోబిన్ పరీక్షలు



వైద్య శిబిరంలో పాల్గొన్న బాలికలతో లయన్స్ క్లబ్ సభ్యులు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో గల న్యూలిటిల్ ఫ్లవర్స్ పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. గ్రేటర్ విజన్ లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ లగడపాటి ప్రభాకర్ సాయంతో ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని పీడీజీ డాక్టర్ కాపా మురళీ కృష్ణ ప్రారంభించారు. బాలికలకు అవసరమైన ఐరన్ టాబ్లెట్‌లు, మల్టీ విటమిన్ టాబ్లెట్‌లు ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, గ్రేటర్ విజన్ క్లబ్ అధ్యక్షురాలు ఉంద్రు వరలక్ష్మి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.